క్లుప్తంగా

ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన సురేష్



దొర్నిపాడు: మండల నూతన ఎస్‌ఐగా సురేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూలు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న తిరుపాల్ నందివర్గానికి బదిలీపై వెళ్లిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ట్రైనీ డీఎస్పీ రఘువీర్ మూడు వారాల పాటు విధులు నిర్వహించారు. డీఎస్పీ షర్ఫుద్దీన్, రూరల్ సీఐ హనుమంతునాయక్‌ను ఎస్‌ఐ సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉద్దేశపూర్వకంగానే ప్రొక్లెయిన్‌కు నిప్పు

దొర్నిపాడు: చాకరాజువేముల– డబ్ల్యూ గోవిందిన్నె గ్రామాల మధ్య జరుగుతున్న రోడ్డు పనులకు వినియోగించే ప్రొక్లెయిన్‌కు (హిటాచి) దుండగులు ఉద్దేశపూర్వకంగానే నిప్పంటించినట్లు తెలుస్తుందని రూరల్ సీఐ హనుమంతునాయక్ చెప్పారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి ఎవరి పాత్ర ఉందనే విషయంపై ఆరా తీస్తున్నామని, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ వస్తున్నాయన్నారు. ఎవరైతే బాధ్యులుగా ఉన్నారో వారిని వెంటనే అరెస్టు చేస్తామన్నారు. కంట్రాక్టర్ శివరామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళ ఆత్మహత్య

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు గ్రామానికి చెందిన మహేశ్వరీ(30) మూడు నెలలుగా మతిస్థిమితం కోల్పోయింది. బుధవారం రాత్రి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నానికి భర్త గంగాధర్ ఫిర్యాదు చేయడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక గురవారం మహేశ్వరీ మృతి చెందిందని, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిర్వహించి మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.

పరీక్ష కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు మూసివేయాలి

నంద్యాల(సిటీ): నంద్యాల జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్, ఇంటర్‌నెట్ కేంద్రాలు నిర్వహించరాదని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బషీరున్నిసా బేగం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి మార్చ్ 20వ తేదీ వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లను మూసివేయాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు ఉంటాయన్నారు.

ముగిసిన ప్రజాపోరు యాత్ర

నంద్యాల(వ్యవసాయం): బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలో నిర్వహిస్తున్న ప్రజాపోరు యాత్ర గురువారం నాటికి ముగిసింది. యాత్ర పట్టణంలో సాయిబాబానగర్, గిరిన్నాథ్ సెంటర్, స్టేట్ బ్యాంక్ కాలనీ, రైతునగరం, కానాల ప్రాంతాల్లో నిర్వహించారు. బీజేపీ అసెంబ్లీ కార్యదర్శి అభిరుచి మధు, మేడా మురళీ, మండల అధ్యక్షుడు గురుబ్రహ్మ, కొట్టె చంద్రశేఖర్, మధుర, శ్రీనివాణి పాల్గొన్నారు.

మహాగర్జన విజయవంతం చేయండి

నంద్యాల(అర్బన్): దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోరుతూ మార్చి 9న గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీ వద్ద నిర్వహిస్తున్న దివ్యాంగుల మహాగర్జనకు వేలాదిగా తరలి రావాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నసుబ్బయ్య యాదవ్, జిల్లా అధ్యక్షుడు గంగాధర్‌శెట్టి పిలుపునిచ్చారు. స్థానిక నిశాంత్ భవన్‌లో గురువారం వీహెచ్‌పీఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

ఫిర్యాదులను నేరుగా తెలియజేయండి

బొమ్మలసత్రం: ప్రజలు తమ ఫిర్యాదులను నేరుగా తనకు తెలియజేసేందుకు లేదా మాట్లాడాలనుకున్న వారు 9154987020 వాట్స్ ఆప్‌లో ఫిర్యాదు చేయవచ్చని లేదా అదే నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయవచ్చని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సెంట్రల్ కంప్లైంట్ సెల్ గురించిన సమాచారం, ఆన్‌లైన్ మోసాలు, జాబ్ ఇప్పిస్తామని మోసం చేసిన, బిట్ కాయిన్స్, లోన్ యాప్‌లలో మోసపోయిన, మరి ఏ ఇతర సైబర్ మోసాలకు గురైన వారు మొదటగా 1930 నంబర్‌కు , లేదా సైబర్ క్రైం ప్రభుత్వ వెబ్‌సైట్‌లో గాని, జిల్లా సైబర్ క్రైమ్ విభాగానికి సంబంధించి 9154987034 గాని ఫోన్ చేసి సంప్రదించవచ్చని సంచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

పే..ద్ద చేప



15కిలోల చేపను చూపుతున్న చిన్న పుల్లయ్య

దొర్నిపాడు: కుందూనది మడుగుల్లో పెద్దపెద్ద చేపలు జాలర్లకు దొరుకుతున్నాయి. కోవెలకుంట్ల మండలం పొట్టిపాడు గ్రామానికి చెందిన సూరటి చిన్నపుల్లయ్య క్రిష్టిపాడు సమీపంలో ఉన్న కుందూనదిలో వలలతో చేపల వేటకు దిగగా బంగారుతీగ చేప చిక్కింది. సుమారు మూడు అడుగులకు పైగా ఈ చేపకు కేవలం ఒకే ముల్లు, రుచికరంగా ఉంటుంది. ఆళ్లగడ్డకు చెందిన ఓ వ్యక్తి దీన్ని రూ.3వేలకు కొనుగోలు చేశాడు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

- కేజీబీవీల్లో పంచతంత్ర పేరుతో వందరోజుల ప్రణాళిక
- 15 వారాంతపు పరీక్షలు, 5 గ్రాండ్ టెస్ట్‌లు
- వెనుబడిన వారిని గుర్తించి సామర్థ్యాల పెంపునకు కృషి
- అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యాలయాలకు ప్రోత్సాహక బహుమతులు

పది, ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఉత్తమ ఫలితాల సాధనకు కస్తూర్బా విద్యాలయాల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. పంచతంత్ర పేరుతో వంద రోజుల ప్రణాళిక రూపొందించి 15 వారాలు వారాంతపు పరీక్షలు, 5 గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహించి వెనుబడిన విద్యార్థులను గుర్తించి వారి సామర్థ్యాలను పెంపొందించి వందశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థినులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు.



ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థినులు

గోస్పాడు: విద్యార్థి దశకు పది, ఇంటర్ పరీక్షలు కీలకం.వారి బంగారు భవిష్యత్‌కు బాటలు లాంటివి. ఇక్కడ చదువుపై దృష్టి సారిస్తే భవిష్యత్‌లో ఉత్తమ ప్రతిభ చాటేందుకు, ఉన్నత స్థానాలు చేరేందుకు, లక్ష్యాలను నిర్దేశించుకొని సాధించుకునే తత్వం అలవడుతుంది. ఇందుకు ప్రభుత్వం, ఉపాధ్యాయులు వారిని పరీక్షలే లక్ష్యంగా కాకుండా ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా కస్తూర్బా విద్యాలయాల్లో విద్యార్థినుల కోసం విద్యాశాఖ పంచతంత్ర పేరుతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తుంది. ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులతో పాటు గ్రాండ్ టెస్టులను నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక ప్రణాళిక..

పంచతంత్ర పేరుతో వందరోజుల ప్రత్యేక ప్రణాళికను పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. పాఠ్యాంశాల వారీగా యాక్షన్ ప్లాన్ తయారు చేసి అందులో స్టడీ ప్లానింగ్, వారాంతపు పరీక్షలు, చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ముందుకు వెళ్తున్నారు.

కేజీబీవీల్లో..

జిల్లాలో 27 కేజీబీవీ పాఠశాలు ఉన్నాయి. ఇందులో 995 మంది విద్యార్థినులు పదవ తరగతి చదువుతున్నారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో 495 మంది ఉండగా, రెండో సంవత్సరంలో 520 మంది విద్యార్థినులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరందరి కోసం సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారులు ప్రత్యేకంగా పంచతంత్ర ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఇందుకోసం కేజీబీవీలో పనిచేసే స్పెషల్ ఆఫీసర్‌తో పాటు సీఆర్‌డీ, పీజీటీలు పాఠశాలలోని విద్యార్థినులను దత్తత తీసుకొని చదివిస్తున్నారు. వారు ఎలా చదువుతున్నారు, ఏఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారు, ఎవరెవరి విద్యా సామర్థ్యాలను మెరుగుపరచాలనే అంశాలను పరిశీలిస్తూ లోపాలను అధిగమించేలా చర్యలు తీసుకుంటున్నారు. కార్యాచరణ అమలును కేజీబీవీల జీసీడీఓ పర్యవేక్షిస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు చర్యలు తీసుకుంటున్నారు.

ఉత్తమ ఫలితాలకు ప్రోత్సాహక బహుమతులు..

- పది, ఇంటర్‌లో వంద శాతం ఫలితాలు సాధించిన కేజీబీవీలకు రూ.25 వేలు నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేస్తారు.
- పది, ఇంటర్ రెండింటిలో వంద శాతం ఫలితాలు సాధించిన కేజీబీవీలకు రూ. 50,000 నగదు బహుమతి, సర్టిఫికెట్ ఇస్తారు.
- సీఆర్‌డీ, పీజీటీలు తమకు సంబంధించిన సబ్జెక్టులలో వంద శాతం ఫలితాలను సాధిస్తే ప్రశంసా ప్రతంతో సత్కరిస్తారు.



స్టడీ అవర్‌లో చదువుకుంటున్న విద్యార్థినులు

వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యం



వందశాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేశాం. మంచి మార్కులు సాధించేందుకు ఈ ప్రణాళిక ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రతి కేజీబీవీలో విద్యార్థినుల సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వారిని మెరుగు పరిచేలా పంచతంత్ర ప్రణాళిక అమలు చేశారు. ప్రతి పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాం. లక్ష్యం సాధిస్తాం.

–సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

మంచి మార్కులు సాధిస్తా



పదో తరగతి పరీక్షల కోసం మా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకొని చదివిస్తున్నారు. ఏవైనా పాఠ్యాంశాలలో సందేహాలు ఉంటే వాటిని వెంటనే నివృతి చేసి చదువులో మంచి ప్రతిభ కనబరిచేందుకు అవసరమైన విధంగా మమ్మల్ని తీర్చిదిద్దుతున్నారు.

– లక్ష్మితేజ, పదవ తరగతి, కేజీబీవీ పాఠశాల

భయం తొలగించారు



పరీక్షలు అంటే భయం లేకుండా చేసేలా పాఠశాలలో నిత్యం చదివించడంతో పాటు పరీక్షలు కూడా నిర్వహించారు. దీంతో ఏడాదికి ఒకసారి జరిగే పబ్లిక్ పరీక్షలు అంటే ఒత్తిడి, భయం లేకుండా పరీక్షలను సులువుగా రాసే వీలు కలిగింది. పాఠశాలలో ఉపాధ్యాయులు ఎప్పటి పాఠ్యాంశాలకు సంబంధించిన అంశాలను చదివించడంతో పాటు రాయిస్తున్నారు. సందేహాలు ఉంటే పరిష్కరించి ఉత్తమ మార్కులు సాధించేలా పలు సూచనలు చేస్తున్నారు.

– సమీరా, ఇంటర్, రెండవ సంవత్సరం, కేజీబీవీ

పక్కా ప్రణాళిక అమలు



కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారికోసం ముందస్తుగా ప్రత్యేక చర్యలు చేపట్టాం. విద్యార్థినుల్లో పరీక్షల పట్ల భయం పోగొట్టి పరీక్షలకు సిద్ధం చేశాం. వంద శాతం మంచి ఉత్తీర్ణత సాధించేలా వారిని అన్ని సబ్జెక్టుల్లో తీర్చిదిద్దుతున్నాం.

–నాగసువర్చల, జీసీడీఓ, నంద్యాల

వన్యప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యత



జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ అనురాగ్ మీనాకు చెక్కు అందజేస్తున్న గంగరాజు ఫౌండేషన్ సభ్యురాలు సుమ

నంద్యాల(సిటీ): వన్యప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యత అని జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ అనురాగ్ మీనా అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో గంగరాజు ఫౌండేషన్ వారు నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ అభివృద్ధి కోసం రూ.7 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గుండ్ల బ్రహ్మేశ్వరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ త్రినాథ్ రెడ్డి, గంగరాజు రంగరాజు, కాశీ రాజు, శైలజ, సుమ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీని సద్వినియోగం చేసుకోవాలి

గోస్పాడు: ప్రభుత్వం మంజూరు చేసిన ఆరోగ్య శ్రీ కార్డులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నాగఅనసూయ అన్నారు. మండలంలోని పసురపాడు సచివాలయంలో గురువారం ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. వైద్యం పరిధిని ప్రభుత్వం రూ.25లక్షలకు పెంచిందని చెప్పారు.

ఆస్తి పన్నుపై వడ్డీ మినహాయింపు

నంద్యాల(సిటీ): ఆస్తి పన్ను బకాయిలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వడ్డీ మాఫీ చేయనున్నట్లు ప్రకటించింది. వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద వడ్డీ మాఫీ చేయనుందని ప్రభుత్వ మున్సిపల్ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. భవనాలు, ఖాళీ స్థలాల పన్నులపై వడ్డీ మాఫీ మార్చి 31 వరకు గడువు ఉందన్నారు. ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

2న మెగా జాబ్‌మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(న్యూటౌన్): మార్చి 2వ తేదీన జరిగే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. గురువారం మెగా జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ హబ్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో సంయుక్తంగా జాబ్ మేళా నిర్వహిస్తుందన్నారు. నిరుద్యోగులు ఇంటర్వ్యూకు హాజరై ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు. జాబ్ మేళాకు 24 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నట్లు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఉన్న 9 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల మూడవ సంవత్సరం విద్యార్థులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో జేకేసీ కో ఆర్డినేటర్ పార్వతి, ప్రతాపరెడ్డి, మహబూబ్‌బాషా, గురువయ్య, మస్తాన్‌లు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ నిరంజన్‌రెడ్డి

నంద్యాల(సిటీ): సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ బూత్‌ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులోని పీపుల్స్ క్లబ్(రోటరీ క్లబ్) పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్, నీటి వసతి, ర్యాంపులు ఇతరత్రా వసతులను కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి, రూట్ ఆఫీసర్లు ఏఈ రామచంద్రాచారి (ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ), బీఎల్‌ఓలు ఉన్నారు.

అమృత్‌తో నీటి కష్టాలకు చెక్



మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా

నంద్యాల(సిటీ): నంద్యాల ప్రజలకు రానున్న 30 సంవత్సరాల పాటు నీటి ఎద్దడి రాకుండా అమృత్ ప్రాజెక్ట్ త్వరలో అందుబాటులోకి రానుందని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా తెలిపారు. గురువారం స్థానిక కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అజెండాలోని అంశాలన్నిటినీ కౌన్సిల్ ఆమోదించింది. నంద్యాల పట్టణానికి జీవనధారగా నిలవనున్న అమృత్ ప్రాజెక్ట్‌కు సంబంధించి పూర్తి వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కౌన్సిల్‌కు మున్సిపల్ ఇంజనీర్ రమణమూర్తి వివరించారు. రూ.158.50కోట్లతో 34.35కిలోమీటర్ల మేర వెలుగోడు నుంచి నంద్యాల పట్టణానికి పైప్ లైన్ల ద్వారా సరఫరా చేయనున్నారన్నారు. (వీబీఆర్)వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద సరికొత్తగా ఫాంటూన్ ఫ్లోటింగ్ పంప్ హౌస్‌ను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ తరహా ప్రాజెక్ట్ మన దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి ప్రాజెక్టు మనదేనన్నారు. ఈ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేయడానికి సహకరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డికి, ఇంజనీర్లకు, అధికారులకు కౌన్సిల్ ప్రత్యేక అభినందనలు తెలియజేసింది.

భూముల ఆక్రమణపై ఆగ్రహం.

అనంతరం సోషల్ మీడియా, పలు వార్తా పత్రికలలో వచ్చిన కథనాలపై కౌన్సిల్ సభ్యులు వివరణ కోరారు. మున్సిపల్ స్థలాలను కొందరు వ్యక్తులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసే వరకు అధికారులు నిద్రపోతున్నారా అంటూ ప్రశ్నించారు..! ఈ సమస్య పై కమిషనర్ ఆదేశాల మేరకు ఏసీపీ(అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్) నరసింహ మూర్తి వివరణ ఇచ్చారు. మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా వాటి పై కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సంబంధిత రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని కోరామన్నారు. అయితే అధికారుల వివరణపై చైర్ పర్సన్, కౌన్సిల్ సభ్యులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కనీసం అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతుంటే నిద్రపోతున్నారా అంటూ నిలదీశారు. తప్పనిసరిగా బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

నేటి నుంచి పింఛన్ పంపిణీ

ఉయ్యాలవాడ : మార్చి నెలకు సంబంధించి వైఎస్‌ఆర్ పింఛన్ కానుక డబ్బులు మంజూరు అయ్యాయని ఎంపీడీఓ రఘురాం తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలోని 3,983 మంది లబ్ధిదారులకు రూ. 1,17,57,000 ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా వలంటీర్లకు అందజేయనున్నట్లు చెప్పారు. 1వ తేదీన వలంటీర్లు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తారన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం

రుద్రవరం: పల్స్‌పోలియోను విజయవంతం చేద్దామని ఎంపీహెచ్‌ఈఓ బాబయ్య పిలుపునిచ్చారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బందితో పల్స్ పోలియోపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీ పరిధిలో 2852 మంది చిన్నారులు ఉండగా, 27పోలియో కేంద్రాలు ఉన్నాయని, 108 మంది సిబ్బందిని ఉన్నతాధికారులు నియమించారని చెప్పారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేసి విజయవంతం చేయాలన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు ఆసుపత్రులకు అనుమతులు ఇస్తున్న అధికారులపై, పేదలను పిప్పి చేస్తున్న ఆసుపత్రుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రైవేటు ఆసుపత్రులకు రోజుకు ఒకటి పుట్టుకొస్తున్నాయన్నారు. ఎలాంటి మౌలిక సదుపాయాలు లేకున్నా అనుమతులు ఇస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు విష్ణు, ఎర్రిస్వామి, చరణ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చోరీకి విఫలయత్నం

నంద్యాల టౌన్: నంద్యాల సర్వజన ఆసుపత్రి ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలల సత్వర చికిత్స కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి విఫల యత్నం చేసినట్లు గురువారం డీఈఐసీ కేంద్ర అధికారి డాక్టర్ కాంతారావు నాయక్ తెలిపారు. బుధవారం రాత్రి కేంద్రం టాయిలెట్ వెంటిలేటర్ అద్దాలను పగలగొట్టి కేంద్ర లోపలికి వెళ్లడానికి ప్రయత్నం చేశారన్నారు. లోనికి వెళ్లడం సాధ్యం కాక పోవడంతో కేంద్రంలోని వస్తువులు ఏవి పోలేదని పేర్కొన్నారు. ఘటన పై విచారణకు ఆదేశించామన్నారు.

అభివృద్ధిని అడ్డుకునేందుకే దుశ్చర్యలు

- దుండగులకు కఠిన శిక్ష తప్పదు
- హెచ్చరించిన గంగుల ప్రభాకర్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి



కాలిపోయిన ప్రొక్లెయిన్‌ను పరిశీలిస్తున్న గంగుల ప్రభాకర్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి

దొర్నిపాడు: అభివృద్ధిని అడ్డుకునేందుకే ఓర్వలేని స్వార్థపరులు ఇలాంటి నీచమైన దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. కరాజువేముల–డబ్ల్యూ గోవిందిన్నె గ్రామాల మధ్య జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులకు వినియోగిస్తున్న ప్రొక్లెయిన్(హిటాచి)ను బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పంటించి కాల్చివేశారు. ఈ మేరకు గురువారం వారు ఘటనా స్థలం చేరుకుని కాలిపోయిన ప్రొక్లెయిన్‌ను పరిశీలించారు. అభివృద్ధికి అడ్డంకులు సృష్టించేలా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు పోలీసులను ఆదేశించారు. ఈమధ్యనే కొండుపల్లె లోనూ రైతుల పంటను దగ్ధం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. గడ్డి వాములు, పంటలు, మిషన్లను కాల్చినవారు ఎవ్వరూ బాగుపడరని, పెద్దమ్మ సాక్షిగా చెబుతున్నా చేయించినవారు శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు. రెండు రోజులు క్రితం ఆళ్లగడ్డలో కూడా ఓ వ్యక్తిని దాడిచేసి వేరేవారిపై నింద మోపేందుకు పన్నాగం పద్దారన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి ఎవరు చేయించారో... ఎవరు చేశారో తేల్చి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. దాదాపు పదిహేనేళ్లుగా కంట్రాక్టు పనులు చేస్తున్నానని, ఎన్నడూ ఇలాంటి సంఘటనలు జరగలేదని కాంట్రాక్టర్ శివరామిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మను గంగుల ప్రభాకర్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, యాదవకార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, నాయకులు నరసింహారెడ్డి, సింగం వెంకటేశ్వరరెడ్డి, శివరామిరెడ్డి, శివారెడ్డి, జాకీర్ బాషా, శాంతయ్య, డీలర్‌పెద్దన్న, చిన్నమద్దిలేటి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక ప్రణాళిక

చాగలమర్రి: తాగు నీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తుందని, గ్రామ పంచాయితీల, జిల్లా, మండల పరిషత్‌ల ద్వారా నిధులు మంజూరు చేసి బోర్లు వేయించే కార్యక్రమాన్ని చేపట్టిందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారులు గంగుల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ కుమారుని వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ షేక్ బాబులాల్ ఇంటికెళ్లి పరామర్శించారు. తదనంతరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి శ్రీశైలం ప్రాజెక్టు నుంచి మూడు పంపుల ద్వారా ముచ్చుమర్రి ప్రాజెక్టు నుంచి 700ల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు.

పవన్ కళ్యాణ్ తీరు...

జనసేన కార్యకర్తలకే నచ్చడం లేదు...

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పవన్ కళ్యాణ్ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని, ఆయన తీరు జనసేన కార్యకర్తలు, నాయకులకే నచ్చడం లేదని, ప్రజలు సైతం చీదరించుకుంటున్నారని గంగుల బిజేంద్రారెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన ప్రసంగించే సమయంలో కార్యకర్తలు రాళ్లు, నీటి బాటిళ్లు విసిరి నిరసన తెలిపారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభలను చూసి...... చంద్రబాబు, పవన్ బహిరంగ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని, ప్రజలు హాజరు కాకపోవడంతో అయోమయంలో పడ్డారన్నారు. వీరితీరు పులిని చూసి నక్క వాత పెట్టుకున్న చందంలా ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరభద్రుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషురమేష్, ఎంపీటీసీ పత్తినారాయణ, సర్పంచ్ గోవిందయ్య, హుసేన్‌వల్లి, సిద్ధిఖ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

మండలంలోని డి.కొత్తపల్లె గ్రామానికి చెందిన వలంటీర్ అరువ రమేష్‌రెడ్డి(35) అనారోగ్యంతో తిరుపతిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. గంగుల బిజేంద్రారెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి గురువారం డి.కొత్తపల్లె చెరుకొని రమేష్‌రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడు రమేష్‌రెడ్డి భార్య మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. వీరికి ఒక కుమారుడు. కర్యక్రమంలో సర్పంచ్ బాలీశ్వరరెడ్డి, ఏర్వ చిన్నపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన పార్టీలకు షాక్

- ఎమ్మెల్యే గంగుల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన 65 మంది టీడీపీ, జనసేన కార్యకర్తల కుటుంబాలు





ఎమ్మెల్యే గంగుల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన కార్యకర్తలు

శిరివెళ్ల: మండల కేంద్రం శిరివెళ్లలో గురువారం టీడీపీ, జనసేన పార్టీలకు భారీ షాక్ తగిలింది. ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రానాథ్‌రెడ్డి సమక్షంలో ఆయా పార్టీలకు చెందిన క్రియా శీలక కార్యకర్తల 65 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ కండవాలు కప్పి సాధరంగా ఆహ్వానం పలికారు. టీడీపీకి చెందిన ఏంజీ సుకూర్, ఇస్మాయిల్, ఖరీం, మునాఫ్, రశీద్, అస్లాం, వహాబ్, తోహెల్, దావూద్, ఆసీఫ్‌కు చెందిన కుటుంబాలు వైఎస్సార్‌సీలో చేరాయి. అదేవిధంగా జనసేనకు చెందిన గాజుల ఖుద్దూస్, ముల్లా జబి ఉల్లా, గాజుల గురు, జాకీర్, అక్తర్, దర్జీ బహదూర్, మగ్బుల్, ఖాజా మొయిద్దీన్, అబ్దుల్ బాషా, ఖుద్దూష్, జావీద్, సలీం, రఫీ, గౌష్ అజీజ్, ముల్లా సద్దాం, షాధిక్ భాషా, హబీబుల్లా వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైఎస్ చైర్మన్ దిల్షాద్‌భేగం, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘువరెడ్డి, ఏంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ. అబ్దుల్ సలాం, మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ హఫీజ్, దేవస్థానం చైర్మన్ తిమ్మరాయుడు, ఆర్యవైశ్య సంఘం నాయకులు సముద్రాల సత్యనారాయణశ్రేష్టి, గండికోట పార్థుడు, రిటైర్డ్ ఏంఈఓ మహబూబ్‌బాషా, కాపు సంఘం నాయకులు ఉల్లి సుబ్బరాయుడు, పెద్దన్న, నాయకులు దొర్నిపాటి రఫీ, ముల్లా అన్వర్‌బాషా, గౌండా ఇబ్రహీం, కార్యకర్తలు పాల్గొన్నారు.

సన్మానం



కృష్టారెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

ఉయ్యాలవాడ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బోరెడ్డి కృష్టారెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బోరెడ్డి కృష్టారెడ్డి దంపతులకు ఎంపీడీఓ రఘురాం, ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డితోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు శాలువాలు కప్పి పూల మాలలతో సత్కరించారు. బోరెడ్డి కృష్టారెడ్డి పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి చేసిన కృషిని ఎంపీడీఓ, ఎంఈఓ ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓలు చెన్నారెడ్డి, మహబూబ్‌బాషా, రంగనాయకులు, ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖరయ్య, నరసింహులు, రామమోహన్‌రెడ్డి, చిన్న వీరారెడ్డి, దక్షిణామూర్తి, శ్రీనివాసులు, పాఠశాల పూర్వ విద్యార్థులు బుడ్డా ఈశ్వరరెడ్డి, కర్నాటి రామక్రిష్టారెడ్డి, సీకే జమాలుద్దీన్, పెద్ద వీరారెడ్డి పాల్గొన్నారు.

రైతన్నకు జగనన్న వెన్నముక

శిరివెళ్ల: దేశానికి రైతన్న వెన్నముక అయితే... జగనన్న రైతన్నకు వెన్నముకగా మారారని వ్యవసాయ ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు ఇరిగెంరెడ్డి తిరుపాల్‌రెడ్డి అన్నారు. గురువారం గోవిందపల్లెని జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై కొనుగోళ్లలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 1551 క్వింటాళ్ల జొన్న ధాన్యం సేకరించామని, రూ 49.32 లక్షలు రైతుల ఖాతాలో జమ అయ్యిందని ఏఓ సుధాకర్ తెలిపారు. వ్యవసాయ పరికరాలు, పట్టాలు, పైప్‌లు కావాలని రైతులు కోరారు. కార్యక్రంలో ఏడీఏ రాంమోహన్‌రెడ్డి, టెక్నికల్ ఏఓ నాగేంద్రప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, ఆర్‌బీకే వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.